క్లుప్తంగా

గర్భిణులకు సామూహిక సీమంతం



కంచికచర్ల: అంగనవాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారం అందజేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కంచికచర్ల, పెండ్యాల సెక్టార్ పరిధిలో మంగళవారం గర్భిణులకు సమూహిక సీమంతం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత మాట్లాడుతూ.. గర్భిణులు, పుట్టబోయే బిడ్డ సురక్షితంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పోషకాహారాన్ని మెనూ ప్రకారం అందజేస్తోందన్నారు. సీడీపీఓ భాగ్యరేణుక, సూపర్‌వైజర్ తారాబీ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుపై రైతుల ఆసక్తి



పెనుగంచిప్రోలు: పచ్చిరొట్ట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు భూమిలో సారం పెంచేందుకు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో చల్లుతున్నారు. పంట వేసే ముందు పచ్చిరొట్ట పైరును భూమిలో కలియ దున్నుతున్నారు. ఫలితంగా భూమి సారవంతమవుతుంది. మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు పచ్చి రొట్ట సాగుతో కళకళలాడుతున్నాయి.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నందిగామ: డాలాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమెరికాకు చెందిన వైద్యులు థామస్, హార్లిన్, ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ మణి ఆనంద్ రోగులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దేవ సహాయం మాట్లాడుతూ.. తమ ట్రస్టు ద్వారా ఇప్పటికే అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించమన్నారు. అమెరికన్ వైద్యులతో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి స్పందన లభించిందన్నారు. ఎంతోమంది దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న రోగులతో పాటు అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య సేవలందించడంతోపాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ఒక్కొక్కరికి రూ.1500 విలువచేసే న్యూట్రిషన్ అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను సందర్శించిన కేరళ బృందం



కంచికచర్ల: మండల కేంద్రమైన కంచికచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని పరిటాల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని కేరళ పాపులేషన్ రీ సెర్చ్ టీం బృందం మంగళవారం సందర్శించింది. పీహెచ్‌సీల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి బృంద సభ్యులు తెలుసుకున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో సిబ్బంది రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీల్లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, పీహెచ్‌సీ వైద్యుడు శ్రావణ్‌కుమార్, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

ఏ.కొండూరు: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని డీవైఈఓ కేవీఎస్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందించాలని, నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ విద్య సంవత్సరానికి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.రాజశేఖర్, ఎంఈఓ-2 కేశవరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం జయరాం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజల వద్దకే సేవలు

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో జగనన్న సురక్షతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఇంటికీ మేలు చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని మార్కండేయ బజారులో ఏడో సచివాలయం, తొర్రగుంటపాలెంలోని సచివాలయం వద్ద 15వ సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొని పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో, ప్రస్తుత జగనన్న పాలనలో ఏపీ సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేలు జరిగిందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఏడో సచివాలయం పరిధిలో ఈ నాలుగేళ్లలో ప్రజలు ఇప్పటికి రూ.8 కోట్ల మేర లబ్ధిపొందారని తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ ప్రాంతంలోని చెరువు కట్ట ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి బైపాస్ రోడ్ వరకు జంగిల్ క్లియరెన్స్ చేయించి రహదారి ఏర్పాటుచేశామని, చెరువు వద్ద పాత బ్రిడ్జి తొలగించి విశాలమైన బ్రిడ్జి నిర్మిస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలో ఉండి అభివృద్ధికి నోచుకోని తొర్రగుంటపాలెం మునిసిపాలిటీలో విలీనమైన తరువాత అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. స్థానికుల ఇళ్ల స్థలాల కోసం ఐదు ఎకరాలు కేటాయించగా, టీడీపీ శ్రేణులు కోర్టుకు వెళ్లడంతో ఆగిపోయిందని గుర్తుచేశారు. కోర్టు నుంచి అనుమతి వచ్చిన వెంటనే స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు మొదలుపెడతామన్నారు. కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. రూ.50 లక్షలతో డ్రెయిన్లు, రూ.95 లక్షలతో రోడ్లు నిర్మించామని తెలిపారు. పట్టణంలో అన్ని వార్డుల్లో కంటే అధికంగా తొర్రగుంటపాలెం సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.12 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, మునిసిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు పూసల సీతారావమ్మ పుల్లారావు, గింజుపల్లి వెంకట్రావు, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, నాయకులు తుమ్మేపల్లి నరేంద్ర, కుంచపు నారాయణ, మునిని రాజ్యలక్ష్మి, మొహిద్దీన్, బద్దూనాయక్, గోగుల వెంకయ్య, నంబూరి రవి, ఖాదర్‌బాబు, చిలుకూరి శ్రీనివాస్, జాన్ బాషా, కాసర్ల బాలస్వామి, పాటి సాంబ, సుబ్బారావు, శ్యామల, మునిహేరా పాల్గొన్నారు.



తక్కెళ్లపాడులో లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తదితరులు



కంచికచర్లలో కౌలు రైతుకు కౌలు గుర్తింపు కార్డు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తదితరులు

సురక్షతో ఉచితంగా ప్రభుత్వ సేవలు

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): జగనన్న సురక్ష క్యాంపులతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. తక్కెళ్లపాడులో జగనన్న సురక్ష క్యాంపు మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయభాను మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. నేడు జగనన్న సురక్ష క్యాంపులతో అధికారులు సర్వే చేసి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా వారి చేతికే అందిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. గ్రామంలో నాలుగున్నరేళ్లలో రూ.10.71 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. మండలంలోనే వైఎస్సార్ జలకళ పథకంలో 55 మంది రైతులకు బోర్లు ఉచితంగా వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో ప్రసాద్, కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, ఏసోబు, శ్యామల, శ్రీనివాస్ గౌడ్, జానకిరామయ్య, బజారు సాయి, రవికుమార్, గద్దం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

వత్సవాయి: దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మంగొల్లు, దేచుపాలెం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు యేశపోగు దేవమణి, గోసు రత్నకుమారి, సర్పంచ్‌లు అన్నెపాక ప్రణీత, బొల్లం నారాయణప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు సామినేని లక్ష్మీనారాయణ, అన్నెపాక నరసింహారావు, తహసీల్దార్ వైకుంఠరావు, ఎంపీడీఓ సీహెచ్ చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో సంతృప్తికర పరిష్కారాలు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష క్యాంపులతో ప్రజా సమస్యలకు సంతృప్తికర పరిష్కారాలు లభిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని తాటిగుమ్మి, నరసింహారావుపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను ఆయన పరిశీలించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆశయ్య నాయక్, ఎంపీడీఓ అరుంధతీ దేవి, సర్పంచ్‌లు బొమ్మిశెట్టి దుర్గాదేవి, పలకా మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, పచ్చాల కోటేశ్వరరావు, బండి విజయపాల్ రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

కంచికచర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేసిందంటేనే ఆశీర్వదించండి అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కంచికచర్ల, పెండ్యాల గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభలు జరిగాయి. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులు అందరికీ అందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కంచికచర్ల-3 గ్రామ సచివాలయ పరిధిలో 780 మందికి, పెండ్యాల-2 సచివాలయ పరిధిలో 385 మందికి సర్టిఫికెట్లు పంపిణీచేశారు. ఎంపీపీ షేక్ మలక్ బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఉపసర్పంచి వేమా సురేష్ బాబు, ఎంపీటీసీ సభ్యులు బర్రె ఉదయ్‌కిరణ్, మాడుగుల మధుబాబు, షేక్ బడే హజరత్, చింతా రవీంద్రనాథ్, తహసీల్దార్ శంకరబాబు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, డెప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి శ్రీలక్ష్మీ ఏపీఎం కోట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు జనం జేజేలు

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. వెంకటాపురం సర్పంచ్ కూచి నర్సయ్య, తోటచర్ల సర్పంచ్ కునగుంట్ల రాములమ్మ అధ్యక్షతన మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మిగిలిన ఒక్క శాతం ప్రజలకు కూడా అర్హత ఉంటే పథకాలు అందించాలని జగనన్న సురక్ష అమలు చేస్తున్నారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను ఘోరంగా మోసం చేసిందన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్.వి.ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు పొన్నం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాపురంలో..

మండలంలోని శివాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు ఉపసర్పంచ్ తాళ్లూరి నాగేశ్వరరావు, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ లగడపాటి మోహనరావు, ఆలయ ధర్మకర్త కురువెళ్ల రాయప్ప, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు లగడపాటి జనార్దనరావు, డీటీ భాస్కర్ పాల్గొన్నారు.



వెంకటాపురంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఉదయభాను, అధికారులు

గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం కృషి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. వీరులపాడు గ్రామంలో ఆయన మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఆయా ఇళ్ల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరించే బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని గత పాలకుల మాదిరిగా ప్రచారానికే పరిమితం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతల్లో చేసి చూపుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు మహిళలను విస్మరిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం మహిళల సంక్షేమం, రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. మహిళల భద్రతకు ఏర్పాటు చేసిన దిశ యాప్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతి ఒక్క సంక్షేమ పథకంలోను మహిళలను భాగస్వాములను చేస్తున్నారని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.



వీరులపాడులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ప్రజల మంచి కోరే ప్రభుత్వం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల మంచి కోరే ప్రభుత్వమని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, నాయకులు శీలం లక్ష్మీప్రసన్న, మందూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మేలు చేయడమే సీఎం లక్ష్యం

ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్

నందిగామ టౌన్: ప్రజలకు మంచి చేయడం, ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం మాత్రమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలుసని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. చంద్రబాబు మాదిరిగా ప్రజలను మోసం చేయటం చేతకాదని స్పష్టంచేశారు. నందిగామ 13,14 వార్డుల పరిధిలోని ఏడో సచివాలయం, మండలంలోని పల్లగిరి, కేతవీరునిపాడు గ్రామ సచివాలయాలలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో మంచి జరిగింది అనుకుంటేనే అండగా ఉండాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి మంచి చేయాలనే తపనతో ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి ఫలాలు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఎన్నో అభివృద్ధి ఫలాలు అందించారని, చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనబడుతోందని అరుణకుమార్ తెలిపారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రెండేళ్లు కరోనాతో అవస్థలు పడ్డామని తరువాత రెండేళ్లలో కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని సగర్వంగా చెబుతున్నామని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని వివరించారు.



కేతవీరునిపాడు సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

సురక్ష నిరుపేదలకు వరం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష క్యాంపులు నిరుపేదలకు వరమని అరుణకుమార్ తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ అరిగెల సుందరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మంచాల చంద్రశేఖర్, సర్పంచ్‌లు నెలకుదిటి శిరీష, చాగంటి రవికిరణ్ రెడ్డి, ఉప సర్పంచ్ చిలుకూరి బుచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, కౌన్సిల్ సభ్యురాలు గద్దె శేషుకుమారి, వార్డు ఇన్‌చార్జ్ నాదెండ్ల నరేంద్ర, మునిసిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, తహసీల్దార్ నరసింహారావు, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, గోనెల సీతారామయ్య, గద్దె రమేష్, పాకాలపాటి కిరణ్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సక్రమంగా తయారు చేయాలి

మైలవరం: నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా పక్కాగా సక్రమంగా తయారు చేయాలని జెడ్పీ సీఈఓ జ్యోతిబసు తెలిపారు. మైలవరం తహసీల్దారు కార్యాలయంలో అన్ని రాజ కీయ పార్టీల నాయకులతో మంగళవారం రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్ల లిస్టులు తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు రాజకీయ నాయకులతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి, ఎవరైనా మృతి చెంది ఉంటే వారి పేర్లు తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు ముత్యాల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ. వెంకట్రావు, బీజేపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 ,17 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనపర్చారని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత తెలిపారు. మహిళల డబుల్స్‌లో ఎం.సాయిసౌమ్య, కె.జోషితలు ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థినులకు మంగళవారం అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ అకాడమీ, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు, గోళ్ల రాధాకృష్ణ సాహితీపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సినీ నటుడు ఎస్.వి.రంగారావు వర్ధంతి సందర్భంగా విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు స్మారక రంగస్థల పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కళాకారులందరి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఎస్వీఆర్ వంటి నటులు అరుదుగా జన్మిస్తారని, ఆయనను నేటి తరం నటులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ.. ఎస్వీఆర్ నటజీవితానికి పునాది రంగస్థలమేనని పేర్కొన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా ఈ సభకు అధ్యక్షత వహించారు. కార్పొరేటర్ బాల గోవిందు, కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు పి.వి.ఎల్.నృసింహం, వివిధ రంగాలకు చెందిన కంది గంగాధరరావు, గొల్లపూడి గంగాధర్, నందివాడ నాని, రావి వెంకట్ పాల్గొన్నారు. రంగస్థల ప్రముఖులు మద్దాల ఉదయభానుకు 2022 సంవత్సరానికి, కొ్రపాటి వెంకట నారాయణకు 2023 సంవత్సరానికి విశ్వనటచక్రవర్తి ఎస్వీ రంగారావు స్మారక రంగస్థల పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పాండవ రాజసూయం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.



ఉదయభాను, వెంకటనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న మల్లాది విష్ణు, అడపా శేషు

మహోన్నత నటశిఖరం ఎస్వీఆర్

విజయవాడకల్చరల్: మహోన్నత నట శిఖరం ఎస్వీ రంగారావు అని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. భగవాన్ శరణం కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం సినీనటుడు, నిర్మాత, దర్శకుడు ఎస్వీ రంగారావు 49వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నడిచే నట శిఖరం ఎస్వీ రంగారావు అని అభివర్ణించారు. ఆయన పోషించినన్ని విభిన్న పాత్రలు మరే నటుడూ పోషించలేదన్నారు. భగవాన్ శరణం కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ మాట్లాడుతూ 1918వ సంవత్సరంలో నూజివీడులో జన్మించారని, 1946వ సంవత్సరం వరూధిని చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారని చనిపోయేంత వరకూ నటిస్తూనే ఉన్నారని తెలిపారు. ఎస్వీఆర్ విగ్రహం వద్ద పలువురు ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. రంగస్థల ప్రముఖులు ఆచంట బాలాజీ నాయుడు, కొ్రపాటి వెంకట నారాయణ శర్మ, మద్దాల ఉదయ భాను, పీవీఎల్ నృసింహం, పిలకా విశ్వనాథం, సూర్యనారాయణమూర్తి, సాంబశివరావు పాల్గొన్నారు.



ఎస్వీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన హజరత్తయ్య గుప్తా తదితరులు

కాల్వల్లో చెత్త వేస్తే జరిమానా విధింపు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని ప్రధాన కాల్వల్లో చెత్త వేసే వారికి జరిమానా విధించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం బందరు, ఏలూరు, రైవస్, కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించాలంటే ప్రధానంగా పరిసరాలు, కాల్వలు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి రోడ్లపై వేస్తున్న వారిని గుర్తించాలన్నారు. వ్యర్థాలు తరలించే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ వర్కర్లందరూ కాల్వలు, వీధులు నిరంతరం శుభ్రం చేయాలన్నారు. కమిషనర్ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... నైనవరం ఫ్లై ఓవర్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందిందడంతో సీఐ సుబ్రహ్మణ్యం గస్తీ ఏర్పాటు చేయగా కొత్తపేట పితాని అప్పలస్వామి వీధికి పిల్లి సాయికుమార్ (21) అనుమానాస్పదంగా కనిపించాడు. సాయికుమార్‌ను తనిఖీ చేయగా అతని వద్ద కిలోన్నర గంజాయి దొరికింది. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మరుపిళ్ల చిట్టి సేవలు అపూర్వం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ ఎమ్మెల్యే సర్దార్ మరుపిళ్ల చిట్టి నగరానికి అందించిన సేవలు అపూర్వమని పలువురు కార్పొరేటర్లు కొనియాడారు. మరుపిళ్ల చిట్టి 52వ వర్ధంతిని రమణయ్య కూల్‌డ్రింక్‌షాప్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహం వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, మహాదేవు అప్పాజీరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు, మరుపిళ్ల రాజేష్, ఇతర నాయకులు చిట్టి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. మరుపిళ్ల చిట్టి ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధునిగా, శాసనసభ్యునిగా, కాంగ్రెస్ నేతగా విజయవాడ నగరాభ్యున్నతికి విశేషంగా పాటుపడ్డారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి తరం ముందుకు సాగాలని సూచించారు. శ్రీశైలం దేవస్థానం పాలకవర్గ సభ్యుడు గురుమహంతు మహేష్, దుర్గా కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొరగంజి భాను, నగరాల యువజన సంఘం నాయకులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.